మనం

హైదరాబాద్

రంగారెడ్డి | మేడ్చల్

బుధవారం | 14 | అక్టోబర్ | 2026 పేజీలు: 10


# రాజరాజేశ్వరి అవతారంలో గాయత్రి మాత దర్శనం!



అన్నోజిగూడ గాయత్రి మాత ఆలయంలో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ధర్మాన్ని ఆచరిస్తేనే సమాజానికి శ్రేయస్సు... మాధవానంద సరస్వతీ స్వామి

1993-94 బ్యాచ్ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం

4

# బాలల సంరక్షణ గృహం, వృద్ధాశ్రమంలో ఆకస్మిక తనిఖీలు

చిన్నారులు, వృద్ధుల సమస్యలు అడిగి తెలుసుకున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఏ.శ్రీదేవి

ముషీరాబాద్‌లోని నైంటిగేల్ హోమ్, సిస్టర్స్ ఆశ్రమం సందర్శన

బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సహాయంపై అవగాహన







హైదరాబాద్,అక్టోబర్13( మనం న్యూస్): సమాజంలో అభాగ్యులుగా మిగిలిన బాలల సంక్షేమం, వృద్ధుల జీవన భద్రతపై న్యాయ వ్యవస్థ మరింత బాధ్యతగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగానే హైదరాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సెషన్స్ డివిజన్, నాంపల్లి కార్యదర్శి ఏ. శ్రీదేవి మంగళవారం ముషీరాబాద్లోని నైంటిగేల్ బాలల సంరక్షణ గృహం , సిస్టర్స్ హోమ్ వృద్ధాశ్రమాలను ఆకస్మికంగా సందర్శించారు. క్షేత్రస్థాయిలో అందుతున్న సేవల తీరును స్వయంగా పరిశీలించి, అక్కడివారితో ఆప్యాయంగా మాట్లాడారు.

3

# రీచార్జీలు ఫుల్.. సిగ్నల్ మాత్రం నిల్!




ఏడు గ్రామాలకు ఒకే టవర్.. వేలాది మంది ఉద్యోగులకు నెట్వర్క్ ఇక్కట్లు!

అధ్వానంగా మొబైల్ నెట్వర్క్ సేవలు.. ప్రజల సహనానికి పరీక్ష

తక్షణమే క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

జియో ఉన్నతాధికారులు స్పందించాలి.. అదనపు టవర్ ఏర్పాటు చేయాలని గ్రామస్థుల డిమాండ్

4

# నిమ్స్‌లో థ్రాంబోసిస్ అవగాహన వాకథాన్






2

# నిమ్స్‌లో థ్రాంబోసిస్ అవగాహన వాకథాన్

హైదరాబాద్,అక్టోబర్13( మనం న్యూస్)ః ప్రపంచ థ్రాంబోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో వాకథాన్,అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నిమ్స్ వాస్కులర్ అండ్ ఎండోవాస్కులర్ సర్జరీ విభాగాధిపతి ప్రొఫెసర్ డా. సందీప్ మహాపాత్ర నాయకత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ వాకథాన్ను ప్రారంభించారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ వాకథాన్ బుద్ధ విగ్రహం వద్ద ప్రారంభమై, నిమ్స్ ఎమర్జెన్సీ గేట్ మీదుగా ప్రధాన గేటు (పంజాగుట్ట) వరకు కొనసాగింది. అనంతరం నిమ్స్ పాత భవనంలోని లెర్నింగ్ సెంటర్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.'' రక్తం గడ్డకట్టడాన్ని నివారించండి'' అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో థ్రాంబోసిస్, దాని ప్రమాద కారకాలు, హెచ్చరిక లక్షణాలు, నివారణ,చికిత్సపై అవగాహన కల్పించారు.



## ప్రాణాలకే ప్రమాదం..

ఈ సందర్భంగా డైరెక్టర్ రాహుల్ దేవరాజ్ మాట్లాడుతూ.. రక్తం గడ్డకట్టడం వల్ల ప్రాణాపాయ పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని, వీటిని నివారించేందుకు ప్రజల్లో అవగాహన పెంపొందించడం, లక్షణాలను తొలిదశలోనే గుర్తించడం ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడాన్ని థ్రాంబోసిస్ అంటారని, దీనివల్ల డీప్ వీన్ థ్రాంబోసిస్, పల్మనరీ ఎంబాలిజం, స్ట్రోక్, గుండెపోటు వంటి తీవ్రమైన సమస్యలు తలెత్తవచ్చని తెలిపారు. ఎక్కువసేపు కదలకుండా ఉండటం, శస్త్రచికిత్సలు, ఊబకాయం, ధూమపానం వంటివి థ్రాంబోసిస్‌కు సంబంధించిన ముఖ్యమైన ప్రమాద కారకాలని డైరెక్టర్ హెచ్చరించారు. కాళ్లలో నొప్పి, వాపు, అకస్మాత్తుగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతినొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య సహాయం పొందాలని వైద్యులు సూచించారు.









## నివారణ చర్యలపై అవగాహన..

ఈ కార్యక్రమం ద్వారా థ్రాంబోసిస్‌ను ముందుగానే గుర్తించడం, నివారణ చర్యలపై అవగాహన పెంపొందించడం, ప్రజల ఆరోగ్య పరిరక్షణపై నిమ్స్ వాస్కులర్ అండ్ ఎండోవాస్కులర్ సర్జరీ విభాగం తన నిబద్ధతను చాటింది. లక్షణాలను గుర్తించండి - రక్తం గడ్డకట్టడాన్ని నివారించండి - ప్రాణాలను కాపాడండి అనే సందేశాన్ని ఈ కార్యక్రమం ప్రజల్లోకి తీసుకెళ్లింది.ఈ కార్యక్రమంలో నిమ్స్ డీన్ ప్రొఫెసర్ చంద్రశేఖర్, అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డా. కృష్ణా రెడ్డి, వాస్కులర్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అనూష, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణశ్రీ, మీడియా రిలేషన్స్ ఆఫీసర్ సత్యగౌడ్, అలైడ్ సైన్స్ కాలేజ్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, శ్రీనివాస్ తో పాటు అధ్యాపకులు, రెసిడెంట్ వైద్యులు, నర్సింగ్, పారామెడికల్, ఫిజియోథెరఫీ విద్యార్థులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# వైద్య సేవల్లో నిర్లక్ష్యం వీడాలి

**బస్తీ దవాఖానాలపై ప్రత్యేక దృషి**

**సమీక్షా సమావేశంలో హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ స్పష్టీకరణ**

**గర్భిణుల నమోదు, సీజనల్ వ్యాధుల నివారణపై వైద్యాధికారులకు దిశానిర్దేశం**

హైదరాబాద్,అక్టోబర్13( మనం న్యూస్)ః పేదల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న బస్తీ దవాఖానాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు మరింత మెరుగ్గా అందాలని హైదరాబాద్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ తేల్చిచెప్పారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన విషయంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదన్న ఆయన.. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు.మంగళవారం సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రి సమావేశ మందిరంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్‌లు, క్షయ నివారణ అధికారులు,బస్తీ దవాఖానాలు,వైద్యాధికారులతో ఆయన అత్యున్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ జాతీయ, రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును సూచికల వారీగా సమగ్రంగా సమీక్షించారు.



## తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రథమ ప్రాధాన్యత..

గర్భిణిగా నిర్ధారణ అయిన వెంటనే ఆలస్యం చేయకుండా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని డాక్టర్ శ్రీనివాస్ ఆదేశించారు. ప్రసవానికి ముందస్తు పరీక్షలు, అవసరమైన పోషకాహార సలహాలు, వ్యాధి నిరోధక టీకాలను తల్లులకు సమర్థవంతంగా అందించాలన్నారు. మురికివాడల్లో నివసించే నిరుపేదలకు వైద్య సేవలు నిరంతరం అందేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఆసుపత్రులలో అన్ని రకాల అత్యవసర మందులు, పూర్తిస్థాయి వైద్య పరీక్షల సదుపాయాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

## సీజనల్ వ్యాధుల కట్టడి..

వర్షాకాలం ముగిసినప్పటికీ, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది ముందస్తు అప్రమత్తతతో ఉండాలని ఆయన హెచ్చరించారు. దోమల నివారణ,పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని, ప్రభుత్వం నిర్దేశించుకున్న ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను వంద శాతం సాధించే దిశగా వైద్యాధికారులంతా సమన్వయంతో మునుపెన్నడూ లేని విధంగా కృషి చేయాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా కుష్ఠు, క్షయ నివారణ అధికారులు, అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ అనిత, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ సాయిబాబా, డాక్టర్ శ్రీకళ, డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ అశ్రిత, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు, డిప్యూటీ డీఈఎంవోలు, ఇన్చార్జ్ మలేరియా అధికారి, డీపీవో తదితరులు పాల్గొన్నారు.



# డీసీపీ ముత్యం రెడ్డి పదవీ విరమణ

**అఖిల భారత సర్వీసు అధికారుల ఆత్మీయ వీడ్కోలు సభ**

**ఎస్సై నుంచి ఎస్పీ స్థాయి వరకు సేవలు**

**ఆయన సేవలను కొనియాడిన తోటి అధికారులు**

హైదరాబాద్,అక్టోబర్13( మనం న్యూస్)ః శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా.. ఏ పదవిలో ఉన్నా తన నిబద్ధతను, వృత్తి ధర్మాన్ని వీడని ఆదర్శ పోలీసు అధికారి ముత్యం రెడ్డి పదవీ విరమణ పర్వం సహచర అధికారుల ఆశీస్సులు, అపూర్వ ఘనత మధ్య భావోద్వేగంగా ముగిసింది. సుదీర్ఘకాలం పాటు పోలీసు శాఖలో మచ్చలేని సేవలందించి, ఉన్నత శిఖరాలను అధిరోహించిన ఆయన రిటైర్మెంట్ సందర్భంగా హైదరాబాద్లోని ఓ ప్రముఖ హోటల్లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సత్కార సభ అశేష జనవాహిని మధ్య కన్నులపండువగా సాగింది.

## సామాన్యుడి నుంచి ఉన్నత శిఖరాలకు..

1989 జనవరి 16న ఖాకీ దుస్తులను ధరించి పోలీసు శాఖలో ప్రస్థానం ప్రారంభించిన ముత్యం రెడ్డి.. తొలుత సబ్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. తన కఠిన శ్రమ, నిజాయితీ, అంకితభావంతో అంచెలంచెలుగా ఎదుగుతూ ఇన్స్పెక్టర్, డీఎస్పీ, అదనపు ఎస్పీ హోదాల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఇక 2025లో ఎస్పీ హోదాకు పదోన్నతి పొందడం ఆయన వృత్తిపరమైన ప్రతిభకు నిదర్శనం. కేవలం శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కాకుండా.. ఏసీబీ, విజిలెన్స్, స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్, తెలంగాణ జెన్‌కోవంటి అత్యంత కీలకమైన, సున్నితమైన విభాగాల్లోనూ తనదైన ముద్ర వేసి సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారు.

## తోటి అధికారుల ప్రశంసలు..

ఈ ఆత్మీయ సత్కార వేదికపై ముత్యం రెడ్డితో తమకు దశాబ్దాల పాటు ఉన్న అనుబంధాన్ని తోటి ఐపీఎస్, సివిల్ అధికారులు తలచుకుని భావోద్వేగానికి గురయ్యారు. ఏ కష్టమొచ్చినా వెన్నంటి నిలిచే సహృదయత ఆయన సొంతమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సాయి ప్రసాద్ రెడ్డి స్వయంగా ముత్యం రెడ్డిని ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.సహచర పోలీసు బాస్‌ల రాకతో ఈ సభ మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. యాదాద్రి డీసీపీ ఈ. రామచంద్రారెడ్డి, వరంగల్ ఎస్పీ బి. వెంకట్రెడ్డి, గద్వాల ఎస్పీ రంజన్ రతన్, గ్రేహౌండ్స్ ఎస్పీ గంగారెడ్డి, ఆసిఫాబాద్ ఎస్పీ మల్లారెడ్డి, కామారెడ్డి ఎస్పీ శ్రీనివాస్‌రుడ్డి తదితర ప్రముఖ పోలీసు అధికారులు ఈ వేడుకలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ముత్యం రెడ్డి విశ్రాంతి జీవితం పరిపూర్ణ ఆరోగ్యంతో, సుఖసంతోషాలతో సాగాలని మనసారా ఆకాంక్షించారు.

# బాలల సంరక్షణ గృహం, వృద్ధాశ్రమంలో ఆకస్మిక తనిఖీలు

**చిన్నారులు, వృద్ధుల సమస్యలు అడిగి తెలుసుకున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఏ.శ్రీదేవి**

**ముషీరాబాద్‌లోని నైంటిగేల్ హోమ్, సిస్టర్స్ ఆశ్రమం సందర్శన**

**బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సహాయంపై అవగాహన**








హైదరాబాద్,అక్టోబర్13( మనం న్యూస్): సమాజంలో అభాగ్యులుగా మిగిలిన బాలల సంక్షేమం, వృద్ధుల జీవన భద్రతపై న్యాయ వ్యవస్థ మరింత బాధ్యతగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగానే హైదరాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సెషన్స్ డివిజన్, నాంపల్లి కార్యదర్శి ఏ. శ్రీదేవి మంగళవారం ముషీరాబాద్లోని నైంటిగేల్ బాలల సంరక్షణ గృహం , సిస్టర్స్ హోమ్ వృద్ధాశ్రమాలను ఆకస్మికంగా సందర్శించారు. క్షేత్రస్థాయిలో అందుతున్న సేవల తీరును స్వయంగా పరిశీలించి, అక్కడివారితో ఆప్యాయంగా మాట్లాడారు.

**చిన్నారుల సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యత..**

ముందుగా నైంటిగేల్ బాలల సంరక్షణ గృహానికి చేరుకున్న కార్యదర్శి శ్రీదేవి.. అక్కడ ఆశ్రయం పొందుతున్న పిల్లల వద్దకు వెళ్లి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారికి అందుతున్న విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం, వసతి సదుపాయాలపై ఆరా తీశారు. పిల్లలకు ఎలాంటి లోటు రాకుండా సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని నిర్వాహకులకు స్పష్టం చేశారు. చిన్నారుల విద్యాభివృద్ధి, మానసిక వికాసానికి అవసరమైన పూర్తి సహకారం అందించాలని, బాలల హక్కుల పరిరక్షణలో రాజీ పడే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

**వృద్ధులకు గౌరవప్రదమైన జీవనం అందాలి..**

అనంతరం ముషీరాబాద్‌లోని 'సిస్టర్స్ హోమ్' వృద్ధాశ్రమాన్ని సందర్శించిన ఆమె.. వృద్ధులతో కాసేపు ముచ్చటించారు. వారి ఆరోగ్యం, వైద్య సదుపాయాలు,భోజన వసతుల గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు. జీవిత చరమాంకంలో ఉన్న వృద్ధులకు సమాజంలో గౌరవప్రదమైన జీవనాన్ని అందించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆశ్రమంలో పరిశుభ్రమైన వాతావరణాన్ని కొనసాగిస్తూ, వారి ఆరోగ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.






**ఉచిత న్యాయ సహాయంపై భరోసా..**

ఈ సందర్భంగా ఆశ్రమ వాసులు, సిబ్బందిని ఉద్దేశించి శ్రీదేవి మాట్లాడుతూ.. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా సమాజంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. బాలల హక్కులు, వృద్ధుల సంక్షేమం, భరణం చెల్లింపులు తదితర న్యాయపరమైన ఏ చిన్న సమస్య ఉన్నా సంకోచించకుండా సంప్రదించి సహాయం పొందవచ్చని భరోసా కల్పించారు. బలహీన వర్గాలకు సత్వర న్యాయం అందించే దిశగా సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి విజయ భాస్కర్, బాలల సంక్షేమ కమిటీ సభ్యులు, వృద్ధాశ్రమ ఇన్చార్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది కేశవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకూ లాభాల వాటా బోనస్ కల్పించాలి!

**రూ.1,754 కోట్ల లాభాల్లో కార్మికులకు 34 శాతం వాటా.. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకూ న్యాయం చేయాలి**

ఘట్కేసర్ మనం న్యూస్ అక్టోబర్ 13: సింగరేణి సంస్థ సాధించిన రూ.1,754 కోట్ల లాభాల్లో 34 శాతం వాటాగా రూ.596.36 కోట్లను కార్మికులకు చెల్లించాలని నిర్ణయించడం హర్షణీయం. ఈ లాభాల వాటా బోనస్ కింద ఒక్కో శాశ్వత కార్మికునికి గరిష్ఠంగా రూ.1,54,913 అందనుండటం కార్మికుల శ్రమకు గుర్తింపుగా నిలుస్తుంది. సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులకు లాభాల్లో వాటా కల్పించడం స్వాగతించదగిన నిర్ణయం. అయితే, సింగరేణి అభివృద్ధికి దశాబ్దాలపాటు సేవలందించి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు కూడా తగిన ఆర్థిక ప్రయోజనాలు కల్పించాల్సిన అవసరం ఉంది.సింగరేణి సంస్థ అభివృద్ధి వెనుక ప్రస్తుత కార్మికుల శ్రమతోపాటు గతంలో పనిచేసిన ఉద్యోగుల కృషి కూడా ఉంది. భూగర్భ గనుల్లో ప్రాణాలను పణంగా పెట్టి బొగ్గును వెలికితీసిన కార్మికులు, సాంకేతిక సిబ్బంది తమ జీవితాల్లో విలువైన సంవత్సరాలను సంస్థకే అంకితం చేశారు. వారి కృషి, అనుభవం, త్యాగాల పునాదులపైనే నేడు సంస్థ ఉత్పత్తి, ఆదాయం, అభివృద్ధిలో ముందుకు సాగుతోంది. అలాంటి ఉద్యోగులు పదవీ విరమణ చేసిన తర్వాత వారి సంక్షేమాన్ని విస్మరించడం సమంజసం కాదు.ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు, వైద్య ఖర్చులు గణనీయంగా పెరుగుతున్నాయి. పెన్షన్ ఆధారపడే రిటైర్డ్ ఉద్యోగులు, ముఖ్యంగా వృద్ధాప్యంలో ఉన్నవారు, కుటుంబ అవసరాలను తీర్చుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిరంతర వైద్య చికిత్సలు, మందుల ఖర్చులు వారి ఆర్థిక పరిస్థితిపై అదనపు భారాన్ని మోపుతున్నాయి. ఈ నేపథ్యంలో పదవీ



విరమణ చేసిన ఉద్యోగులకు ప్రత్యేక ఆర్థిక ప్రయోజనాలు కల్పించడం అత్యంత అవసరం.సింగరేణి సంస్థ రూ.1,754 కోట్ల లాభాలను ఆర్జించి, అందులో రూ.596.36 కోట్లను కార్మికుల లాభాల వాటా బోనస్గా కేటాయించడం సంస్థ ఆర్థిక సామర్థ్యాన్ని తెలియజేస్తోంది. ప్రస్తుత కార్మికులకు లాభాల్లో వాటా కల్పిస్తున్న తరుణంలో, సంస్థ అభివృద్ధికి గతంలో సేవలందించిన రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమానికి కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులకు వర్తించే బోనస్ను యథాతథంగా రిటైర్డ్ ఉద్యోగులకు వర్తింపజేయడం సాధ్యమా అనే అంశాన్ని ఆర్థిక, చట్టపరమైన కోణాల్లో పరిశీలించాలి. అవసరమైతే ప్రత్యేక ఆర్థిక సహాయం లేదా ఇతర సంక్షేమ ప్రయోజనాల రూపంలో వారికి న్యాయం చేయాలి.తెలంగాణ ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం రిటైర్డ్ ఉద్యోగుల సంఘాలతో చర్చించి వారి సమస్యలను పరిష్కరించాలి. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ప్రత్యేక ఆర్థిక ప్రయోజనాలు కల్పించడం, వైద్య సదుపాయాలను మెరుగుపరచడం, పెన్షన్ సంబంధిత సమస్యలను వేగంగా పరిష్కరించడం వంటి చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా వృద్ధాప్యంలో ఆర్థిక, ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉద్యోగులకు ప్రాధాన్యత ఇవ్వాలి.సింగరేణి కార్మికుల సంక్షేమం అంటే ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులకే ప్రయోజనాలు కల్పించడం కాదు; సంస్థ అభివృద్ధికి పునాదులు వేసిన రిటైర్డ్ ఉద్యోగులకూ ఆర్థిక భరోసా కల్పించడం. వారి సేవలను గుర్తించి గౌరవప్రదమైన జీవనానికి తోడ్పడటం సంస్థకు, ప్రభుత్వానికి ఉన్న సామాజిక బాధ్యత.కావున, తెలంగాణ ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం రూ.1,754 కోట్ల లాభాల్లో కార్మికులకు 34 శాతం వాటాగా రూ.596.36 కోట్లను కేటాయించిన నేపథ్యంలో, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు కూడా తగిన ఆర్థిక ప్రయోజనాలు కల్పించేలా సానుకూల నిర్ణయం తీసుకోవాలి...



# సంస్కృతి, సంప్రదాయాల ప్రతీక బతుకమ్మ

**టీజీఓ పోస్టర్ ఆవిష్కరించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి**

హైదరాబాద్,అక్టోబర్13( మనం న్యూస్): తెలంగాణ అస్తిత్వానికి, సాంస్కృతిక వైభవానికి ప్రతీక అయిన బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా టీజీఓ ఆధ్వర్యంలో రూపొందించిన బతుకమ్మ సంబరాల గోడపత్రికను జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, మంగళవారం తమ కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవ వేడ బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను వారు కొనియాడారు. ప్రభుత్వ ఉద్యోగులంతా కుటుంబ సమేతంగా పండుగను ఆనందోత్సాహలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా టీజీఓ అధ్యక్షుడు ఎం.బి. కృష్ణ యాదవ్, ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ అబ్దుల్ ఖాదర్, అలాగే సంఘం నాయకులు జి.ఎస్. చంద్రజ్యోతి, సరస్వతి, పద్మజ, కేదారేశ్వరి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం



మేడ్చల్, అక్టోబర్ 13: ( మనం జిల్లా ప్రతినిధి): నిర్వహణ పనుల్లో భాగంగా నేడు విద్యుత్తు సరఫరాల్లో పలు ప్రాంతాలలో అంతరాయం కలుగునుందని గుండ్ల పోచంపల్లి విద్యుత్ శాఖ ఏఈ విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8:30 నుండి 10:30 గంటల వరకు 33/11 కేవీ కండ్లకోయ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు.

**విద్యుత్ అంతరాయం కలిగే ప్రాంతాలు:**

గోద్రెజ్ ఇండస్ట్రీస్ లైన్, జి.పి. పల్లి, కె.వి. రెడ్డి నగర్ గ్రామం, మైపి విల్లాస్, అంతం విల్లాస్, సాయి గీత ఆశ్రమం రోడ్డు, పి.టి.సి, మై ప్లేస్ అపార్ట్మెంట్, లక్ష్మి ఇన్నా, ప్రెస్టీజ్ పార్క్, జయదర్శిని ఎన్క్లేవ్, సోమాన్య స్టీల్స్, కార్తీక్ రెడ్డి గోడౌన్స్, కండ్లకోయ, కండ్లకోయ గ్రామం, ఎగ్ వుడ్ కంపెనీ, సాయిగీత రోడ్డు, సుతారిగూడ గ్రామం, టోల్గేట్, సర్వీస్ రోడ్డు, గుబ్బ స్టోరేజెస్, రైల్వే ట్రాక్ రోడ్డులో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

===========

# రాజరాజేశ్వరి అవతారంలో గాయత్రి మాత దర్శనం!

**అన్నోజిగూడ గాయత్రి మాత ఆలయంలో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ**

**భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు**

**సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత**

**ధర్మాన్ని ఆచరిస్తేనే సమాజానికి శ్రేయస్సు... మాధవానంద సరస్వతీ స్వామి**

**1993-94 బ్యాచ్ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం**



ఘట్కేసర్ మనం న్యూస్, అక్టోబర్ 13: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పోచారం డివిజన్ అన్నోజిగూడ గాయత్రి మాత ఆలయం మంగళవారం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అమ్మవారు రాజరాజేశ్వరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమివ్వడంతో ఆలయ ప్రాంగణం భక్తిపారవశ్యంతో నిండిపోయింది. ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేదమంత్రోచ్ఛారణలు, ప్రత్యేక పూజలతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త మాధవానంద సరస్వతీ స్వామి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. మానవ జీవితంలో ధర్మాచరణకు అత్యంత ప్రాధాన్యం ఉందని, ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని ధైర్యంగా ఆచరిస్తూ దాని పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**ధర్మాచరణతోనే సమాజానికి శ్రేయస్సు**

సనాతన ధర్మం మానవాళికి సన్మార్గాన్ని చూపుతుందని మాధవానంద సరస్వతీ స్వామి పేర్కొన్నారు. ధర్మాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఆధ్యాత్మిక చింతనతో మానవ జీవితానికి సార్థకత చేకూరుతుందని వివరించారు. భక్తి, విశ్వాసం, సత్ప్రవర్తనతో జీవిస్తూ సమాజంలో శాంతి, సామరస్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. గాయత్రి అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ భక్తులను ఆశీర్వదించారు.

**భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు**

రాజరాజేశ్వరి దేవి అవతారంలో దర్శనమిచ్చిన గాయత్రి మాతకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనంతో భక్తులు ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు. ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది.

**1993-94 బ్యాచ్ ఆధ్వర్యంలో అన్నదానం**



అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా 1993-94 బ్యాచ్ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. భక్తుల భాగస్వామ్యంతో పూజా కార్యక్రమాలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి.

**పాల్గొన్న ప్రముఖులు**

ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, జితేందర్ నాయక్, అల్వాల వెంకటేష్ గౌడ్, రంజిత్ నాయక్, మొగుళ్ళ కృష్ణ గౌడ్, బాలగొని శ్రీనివాస్ గౌడ్, సాగర్ సంజిత్ యాదవ్, నల్లవెల్లి శివాజీ ముదిరాజ్, రాధారం బాలాజీ పాల్గొన్నారు.

అలాగే ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు మోహన్‌రావు, సిద్ధి రాములు గుప్తా, నాయకులు కొంతం అంజిరెడ్డి, లక్ష్మణ్ యాదవ్, సంతోష్ నాయక్, రాఘవేందర్ రెడ్డి, కార్తీక్ పంతులు, కౌశిక్ పంతులు తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు...

---



## నూతన ఉత్పత్తులను విడుదల చేసిన సైకిల్ ప్యూర్

హైదరాబాద్, అక్టోబర్ 13 (మనం న్యూస్) : 78 ఏళ్ల పరిమళాల వారసత్వాన్ని కొనసాగిస్తున్న సైకిల్ ప్యూర్ అగర్బత్తి, పండుగ సీజన్ను పురస్కరించుకుని హైదరాబాద్లో రాయల్ సీక్రెట్, బన్నూరి దర్బార్లను ఆవిష్కరించినట్లు సంస్థ సీఈఓ, ఎండీ అర్జున్ రంగ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వుడ్స్, దసరా, యజ్ఞలతో పాటు ఈ ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకొచ్చి, ఏటా 1,200 కోట్లకు పైగా అగర్బత్తీలను ఉత్పత్తి చేస్తూ 75కు పైగా దేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు. ఎన్ఆర్ ఫౌండేషన్ ద్వారా విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారతకు తోడ్పడుతున్నట్లు చెప్పారు. మహారాష్ట్రలోని గడ్చిరోలిలో గిరిజన మహిళలకు ఉపాధి కల్పిస్తున్న సైకిల్ ప్యూర్, 12 ఏళ్లుగా కార్బన్ న్యూట్రల్గా కొనసాగుతోందని పేర్కొన్నారు.

# రీచార్జీలు ఫుల్.. సిగ్నల్ మాత్రం నిల్!

**ఏడు గ్రామాలకు ఒకే టవర్.. వేలాది మంది ఉద్యోగులకు నెట్వర్క్ ఇక్కట్లు!**

**అధ్వానంగా మొబైల్ నెట్వర్క్ సేవలు.. ప్రజల సహనానికి పరీక్ష**

**తక్షణమే క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి**

**జియో ఉన్నతాధికారులు స్పందించాలి.. అదనపు టవర్ ఏర్పాటు చేయాలని గ్రామస్థుల డిమాండ్**

షాబాద్, అక్టోబర్ 13(మనం న్యూస్ ) : సాంకేతిక పరిజ్ఞానం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత తరుణంలోనూ ఏడు గ్రామాల ప్రజలు నాణ్యమైన మొబైల్ నెట్వర్క్ సేవలకు నోచుకోకపోవడం విచారకరం. హైతాబాద్,పెద్దవేడు, చందనవెల్లి, రుద్రారం, మాచనపల్లి, అంతిరెడ్డిగూడ, సోలిపేట, గ్రామాలకు ఒకే జియో టవర్ ఆధారంగా సేవలు అందుతున్నాయని, ఫలితంగా నెట్వర్క్ సమస్యలు తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తున్నాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సిగ్నల్ కోసం నిరీక్షణ.. కాల్ కలవక నిరాశ!**

మొబైల్ ఫోన్లో సిగ్నల్ బలహీనపడటం, సంభాషణ మధ్యలోనే కాల్స్ నిలిచిపోవడం, ఇంటర్నెట్ వేగం మందగించడం వంటి సమస్యలు నిత్యకృత్యంగా మారుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. విద్యార్థులకు విద్యాసంబంధిత సమాచారం పొందడం, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాల కోసం దరఖాస్తు చేసుకోవడం, వ్యాపారులకు ఆన్లైన్ లావాదేవీలు నిర్వహించడం, సామాన్య ప్రజలకు అత్యవసర సమాచారాన్ని చేరవేయడం సైతం కష్టసాధ్యంగా మారుతున్నాయని వాపోతున్నారు.




**రీచార్జీల వసూళ్లలో వేగం.. సేవల మెరుగుదలలో జాప్యమెందుకు?**

వినియోగదారులు నిర్ణీత కాలవ్యవధిలో రీచార్జీలు చేసుకుంటున్నప్పటికీ, అందుకు తగిన నాణ్యమైన సేవలు అందకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఏడు గ్రామాల నెట్వర్క్ అవసరాలకు ప్రస్తుత టవర్ సామర్థ్యం సరిపోతుందా? సిగ్నల్ బలహీనతకు అసలు కారణాలేమిటి? అనే అంశాలపై సంబంధిత అధికారులు సమగ్ర పరిశీలన చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించరా?**

జియో సంస్థ ఉన్నతాధికారులు, సాంకేతిక విభాగం సిబ్బంది తక్షణమే క్షేత్రస్థాయిలో పర్యటించి, ఏడు గ్రామాల్లో నెట్వర్క్ నాణ్యతను పరీక్షించాలని ప్రజలు కోరుతున్నారు. అవసరాన్ని బట్టి అదనపు మొబైల్ టవర్ ఏర్పాటు చేయడంతోపాటు, ప్రస్తుత టవర్ సామర్థ్యాన్ని పెంచి, సిగ్నల్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. సమస్య పరిష్కారానికి నిర్దిష్ట కార్యాచరణ రూపొందించి, పనుల పురోగతిపై వినియోగదారులకు స్పష్టతనివ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**పారిశ్రామిక ప్రగతికి నెట్వర్క్ సమస్యల అవరోధం!**

చందనవెల్లి పరిసర ప్రాంతాల్లో పలు పరిశ్రమలు, కంపెనీలు ఉండటంతో వేలాది మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఇంతటి పారిశ్రామిక ప్రాధాన్యమున్న ప్రాంతంలో మొబైల్ నెట్వర్క్ సేవలు నిరంతరాయంగా అందించడం అత్యంత అవసరం. అయితే సిగ్నల్ బలహీనత, కాల్స్ మధ్యలోనే నిలిచిపోవడం, ఇంటర్నెట్ వేగం తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. ఇవి ఉద్యోగులు, వ్యాపారులు, గ్రామీణ ప్రజల రోజువారీ కార్యకలాపాలకు ఆటంకంగా మారే అవకాశం ఉంది.

ప్రజల దైనందిన అవసరాలతో ముడిపడిన మొబైల్ నెట్వర్క్ సమస్యను ఇకనైనా నిర్లక్ష్యం చేయకుండా, సంబంధిత సంస్థ యాజమాన్యం తక్షణ చర్యలు చేపట్టాలి. ఏడు గ్రామాల ప్రజలకు అంతరాయరహితమైన, నాణ్యమైన టెలికాం సేవలు అందేలా చర్యలు తీసుకొని, సమస్యకు స్వల్పకాలంలోనే పరిష్కారం చూపాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# 252 సర్వే నెంబర్లులో కబ్జా

**మా స్థలం మాకు ఇప్పించాలంటూ బాధితుల విజ్ఞప్తి**

**252 సర్వే నెంబర్లు బాధితుల హైడ్రామా**

**ఈ స్థలం మాది అంటూ బోర్డు పెట్టిన బాధితులు**

**కో-ఆపరేటివ్ స్థలం కబ్జా**

**ఆందోళనలో బాధితులు**






మేడ్చల్, అక్టోబర్ 13: ( మనం జిల్లా ప్రతినిధి): మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలో కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలోని 252 సర్వే నెంబర్లు 11 ప్లాట్లను కబ్జాకు పాల్పడి ఎవరు ఏం చేసుకుంటారో చేసుకోండి అన్నట్టుగా అధికారులతో సవాల్ విసురుతున్నారు. అకౌంట్స్ జనరల్ ఆఫీస్ ఎంప్లాయిస్ కో ఆపరేషన్ హౌసింగ్ సొసైటీ కి చెందిన ఈ స్థలాన్ని అదే సొసైటీకి చెందిన వ్యక్తి కబ్జా కు పాల్పడినట్టు ఆ సూసైడ్ కి చెందిన బాధితులు వెంచర్ వద్ద ఆందోళనకు దిగారు. దాదాపు ఇందులో 11 ప్లాట్లకు ప్లాట్లను కబ్జా చేశారని ఆరోపిస్తూ అందులో ఆ సొసైటీ కి సంబంధించిన బోర్డును పాతారు. ఈ వ్యవహారంపై కోర్టులో కేసు నడుస్తుండగా సదరు వ్యక్తి తమ ప్లాట్లను కబ్జా చేసి తమపై కోర్టులో కేసు వేశాడని ఆరోపించారు. వారు తెలిపిన ప్రకారం వివరాలు ఎలా ఉన్నాయి. గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలో 252 సర్వే నెంబర్లు అకౌంట్స్ జనరల్ ఆఫీస్ ఎంప్లాయిస్ కోఆపరేషన్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ ద్వారా ప్లాట్లు కొనుగోలు చేశారు. అయితే కొంతమంది ఉద్యోగులు సొసైటీ ద్వారా ఈ ప్లాట్ ను కొనుగోలు చేసుకున్నారు.

అయితే ఇక్కడ వరకు బాగానే ఉన్నా ఆ సొసైటీ కి చెందిన ప్రతినిధి దాదాపు 11 ప్లాట్లు ( 200 గజాలు ) ఉన్న ప్లాట్ ను కబ్జా చేసుకుని తన ఆధీనంలోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న బాధ్యతలు తమ ప్లాట్ల వద్దకు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు.

**రూపాయి రూపాయి జమ చేసి ప్లాట్లు కొన్నాం**

రూపాయి రూపాయి జమ చేసుకొని ప్లాట్లు కొనుక్కున్నామని తీరా ఇప్పుడు తమ సొసైటీకి చెందిన ప్రతినిధి మా ప్లాట్లను కబ్జా చేసి మా పైనే కోర్టులో కేసు వేశారని, కోర్టులో విచారణ జరుగుతున్న సమయంలోనే సదరు వ్యక్తి

11 ప్లాట్ లలో మొరం తో చదును చేస్తూ నాదే ఈ ప్లాట్ లో అంటూ వ్యవహరిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. తాము సొసైటీ ద్వారా ఈ ప్లాట్లను కొనుగోలు చేశామని, మా దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయని సదరు వ్యక్తి మా పై కోర్టులో కేసు వేశారని, మాకు ఈ స్థలం తప్ప వేరే ఆధారం లేదని బాధితుల ఆరోపిస్తున్నారు. కోర్టులో కేసు నడుస్తుండగా మా స్థలాలను సైతం మట్టితో చదును చేసి తన ఆధీనంలోకి ఉంచుకున్నారని, ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని బాధితులు సంబంధిత రెవెన్యూ అధికారులను, జిల్లా కలెక్టర్ ను కోరుతున్నారు.



# నడుచుకుంటూ వెళ్తుండగా బొలెరో ఢీ.. వ్యక్తి మృతి

శామీర్ పేట్, అక్టోంబర్ 13 ( మనం ): బొలెరో వాహనం ఢీకొని కత్తి నర్సింలు (55) అనే వ్యక్తి మృతి చెందిన ఘటన జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.

జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ సీఐ గురువయ్య గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.... అలియాబాద్ మున్సిపాలిటీ లాల్గడి మలక్పేట్ గ్రామానికి చెందిన కత్తి నర్సింలు (55) వ్యక్తి సోమవారం రోజున తన కుమార్తె ఇంటికి ఎదులాపూర్ గ్రామానికి వెళ్లి తిరిగి సాయంత్రం అలియాబాద్ చౌరస్తా వద్ద బస్సు దిగి అలియాబాద్ సమీపంలోని శుభం గార్డెన్స్ ఎదురుగా రహదారికి ఎడమవైపు నడుచుకుంటూ వెళ్తుండగా, వెనుక నుండి వచ్చిన టిఎస్07 యుఎల్2708 నంబరు గల బొలెరో వాహనం యొక్క డ్రైవర్ అయన ను ఢీకొట్టాడు. ఈ రోడ్డు ప్రమాదంలో నర్సింలుకు తలకు తీవ్ర గాయమైంది. స్థానికుల సహాయంతో ఆయనను వెంటనే మెడిసిటీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించగా, క్షతగాత్రుడు చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. ఈ ఘటనపై మృతుని భార్య కత్తి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ సీఐ గురువయ్య గౌడ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# దోపిడీ కేసు ఛేదించిన పోలీసులు

**ఆటోలో ఎక్కించుకుని యువకుడిపై దాడి..**

**సెల్ ఫోన్ అపహరణ..**

**సీసీటీవీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాలతో**

**ఇద్దరు నిందితుల అరెస్ట్..**



సికింద్రాబాద్, అక్టోబర్ 13 (మనం న్యూస్) నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన సెల్ఫోన్ దోపిడీ కేసును పోలీసులు ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. విలువైన ఒపో ఎఫ్25 ప్రో సెల్ఫోన్ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 7వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో బి. దిలేశు పాత్రా అనే వ్యక్తి తన గదికి వెళ్తుండగా, నారాయణగూడ ఫ్లై ఓవర్ సమీపంలోని రివర్ షోరూం ఎదుట ఓ ఆటో డ్రైవర్ ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించాడు. ఆటో అవసరం లేదని చెప్పినప్పటికీ అతడిని బలవంతంగా ఆటోలోకి లాగి, తన సహచరుడి సాయంతో దాడి చేసి, బాధితుడి ప్యాంటు జేబులోని సెల్ ఫోన్ ను అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నారాయణగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ కెమెరాల ఫుటేజీని పరిశీలించడంతో పాటు సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితులను గుర్తించారు. ఈ క్రమంలో అక్టోబర్ 12న మధ్యాహ్నం చాదర్ఘాట్ ప్రాంతంలో ఆటోతో సహా ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులుగా చాదర్ ఘాట్ లోని మూసానగర్కు చెందిన మహ్మద్ అమేర్ (28), నింబోలి అడ్డాలోని కర్మాగార్ నగర్ కు చెందిన మెరుగు మణిరాజ్ అలియాస్ మణి (23) ను గుర్తించారు. నారాయణగూడ ఎస్హెచ్ఓ ఎం. సాయిదేశ్వర్, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ బి. అఖిలాష్, డీఎస్ఐ ఛి. నాగరాజు, క్రైమ్ సిబ్బంది ఈ కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించారు. ఖైరతాబాద్ జోన్ డీసీపీ కె. శిల్పవల్లి పర్యవేక్షణలో జరిగిన ఈ చర్యలను ఉన్నతాధికారులు అభినందించారు.

# శామీర్‌పేటలో దొంగల కన్ను.. ఇంట్లోని వస్తువులన్నీ స్వాహా

శామీర్ పేట్, అక్టోంబర్ 13 ( మనం ): శామీర్పేట పెద్దమ్మ కాలనీలో తాళం వేసిన ఇంటిని లక్ష్యంగా చేసుకున్న గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులతో కలిసి శుభకార్యానికి వెళ్లిన ఇంటి యజమానురాలు తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించింది.

వివరాల్లోకి వెళ్తే.. ఈ నెల 9న మధ్యాహ్నం 3:30 గంటలకు బాధితురాలు కుటుంబ సభ్యులతో కలిసి జడ్చర్లలో జరిగే శుభకార్యానికి వెళ్లింది. ఈ నెల 13న ఉదయం 7:30 గంటలకు ఇంటికి తిరిగి రాగా, ప్రధాన ద్వారం తాళంతో పాటు బీరువా తాళం కూడా



పగులగొట్టి కనిపించాయి. ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో బీరువాను పరిశీలించగా సుమారు ఐదు తులాల వెండి పట్టీలు కనిపించలేదు. దీంతో పాటు గ్యాస్ సిలిండర్, 43 అంగుళాల ఎల్జీ స్మార్ట్ టీవీ, ఐదు స్పీకర్లతో కూడిన సౌండ్ సిస్టమ్, ఏస్యూస్ ల్యాప్టాప్, టేబుల్ ఫ్యాన్ను దొంగలు అపహరించినట్లు బాధితురాలు తెలిపింది. ఘటనపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. చోరీకి పాల్పడిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టాల్సి ఉంది.

# మాజీ సర్పంచ్ సత్యనారాయణ రెడ్డికి ఎమ్మెల్యే మల్లారెడ్డి ఘన నివాళి

**పార్థివదేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి**

**కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి**

**అంతిమయాత్రలో పాల్గొన్న మేడ్చల్ ఎమ్మెల్యే**

ఘట్కేసర్ మనం న్యూస్ అక్టోబర్ 13: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ మండలం అంకుశాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ కొమ్మిడి సత్యనారాయణ రెడ్డి మృతి పట్ల మాజీ మంత్రి, మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సత్యనారాయణ రెడ్డి మృతి గ్రామ ప్రజలకు, ఆయన అభిమానులకు తీవ్ర విషాదాన్ని కలిగించింది.

మరణవార్త తెలుసుకున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి వెంటనే అంకుశాపూర్ గ్రామానికి చేరుకుని సత్యనారాయణ రెడ్డి పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ కొద్దిసేపు మౌనం పాటించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని సూచించారు.



మాజీ సర్పంచ్గా సత్యనారాయణ రెడ్డి గ్రామ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని ఎమ్మెల్యే మల్లారెడ్డి పేర్కొన్నారు. గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో, మౌలిక వసతుల అభివృద్ధిలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ప్రజలతో సన్నిహితంగా మెలుగుతూ గ్రామ సంక్షేమం కోసం నిరంతరం పనిచేసిన ఆయన సేవలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు.

సత్యనారాయణ రెడ్డి మరణం ఆయన కుటుంబ సభ్యులకు మాత్రమే కాకుండా అంకుశాపూర్ గ్రామ ప్రజలకు, సన్నిహితులకు తీరని లోటని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు.

అనంతరం నిర్వహించిన అంతిమయాత్రలో ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొని సత్యనారాయణ రెడ్డికి తుది వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ పెద్దలు, అభిమానులు, బంధువులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మాజీ సర్పంచ్కు కన్నీటి నివాళులు అర్పించారు.

# బేగంపేట పోలీసుల వలకు అంతర్ జిల్లా బైక్ దొంగల ముఠా

**రూ.20 లక్షల విలువైన 36 బైకులు స్వాధీనం.. ముగ్గురు అరెస్ట్..**

**16 పోలీస్స్టేషన్ ల పరిధిలో 42 వాహనాల చోరీ.. నిందితులు రిమాండ్కు..**



సికింద్రాబాద్, అక్టోబర్ 13 (మనం న్యూస్) నగరంతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా ముఠాను బేగంపేట పోలీసులు అరెస్ట్ చేశారు. ముగ్గురు నిందితుల నుంచి రూ.20 లక్షల విలువైన 36 బైకు లను స్వాధీనం చేసుకున్నట్లు మల్కాజిగిరి డీసీపీ సీహెచ్ శ్రీధర్ వెల్లడించారు. మంగళవారం బేగంపేట పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు.

**పాత నేరస్తులే ముఠా సభ్యులు..**

మంచిర్యాల జిల్లా జిన్నారానికి చెందిన సంపంగి రమేష్ (40), పెద్దపల్లి జిల్లా ధర్మారానికి చెందిన సంపంగి మల్లేష్ (36), సప్పిడి రాజకుమార్ (50) ఈ ముఠాలోని సభ్యులని డీసీపీ తెలిపారు. రమేష్ పై గతంలోనే 24 క్రిమినల్ కేసులు ఉన్నాయని, ఇటీవల వరంగల్ జైలులో శిక్ష అనుభవించి విడుదలైన తర్వాత మళ్లీ బైక్ దొంగతనాలకు పాల్పడినట్లు వివరించారు. హైదరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని ఆరు పోలీస్స్టేషన్లతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 16 పోలీస్స్టేషన్ ల పరిధిలో 42 వాహనాలను చోరీ చేసినట్లు విచారణలో తేలిందన్నారు.



**రద్దీ ప్రాంతాల్లో బైకులే లక్ష్యం..**

ఆట స్థలాలు, బస్ స్టాండ్లు, రైల్వేస్టేషన్ పార్కింగ్ ప్రాంతాలు, కూరగాయల మార్కెట్లు, రద్దీగా ఉండే బహిరంగ ప్రదేశాల్లో పార్క్ చేసిన బైకులను నిందితులు లక్ష్యంగా చేసుకునేవారని డీసీపీ పేర్కొన్నారు. చోరీ చేసిన వాహనాలను గ్రామీణ ప్రాంతాల్లోని అమాయకులు, రైతులకు తక్కువ ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకునేవారని తెలిపారు. వాహనాల కొనుగోలు, విక్రయాలు చేసే డీలర్ లుగా పరిచయం చేసుకుంటూ ప్రజలను నమ్మించి ఈ అక్రమాలకు పాల్పడేవారని వివరించారు.



**ఎనిమిది నెలల్లో 14 బైకుల చోరీ..**

పరేడ్ మైదానం పరిసర ప్రాంతాల్లో ఎనిమిది నెలల్లో 14 బైకులు చోరీకి గురికావడంతో బేగంపేట పోలీసులు ఈ కేసును సవాల్గా తీసుకున్నారు. ఏసీపీ గోపాలకృష్ణమూర్తి, ఇన్స్పెక్టర్ సైదులు, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ జీ. శ్రీనివాస్ పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. తొలుత సప్పిడి రాజకుమార్ను అరెస్ట్ చేసి అతడి నుంచి 14 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ప్రధాన నిందితుడు రమేష్, మరో నిందితుడు మల్లేష్ను అరెస్ట్ చేసి మరో 22 బైకులను రికవరీ చేశారు. ముగ్గురినీ రిమాండ్కు తరలించినట్లు డీసీపీ వెల్లడించారు.

**వాహనాల కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలి..**

సెకండ్ హ్యాండ్ వాహనాలను కొనుగోలు చేసే సమయంలో రిజిస్ట్రేషన్ పత్రాలు, యాజమాన్య వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని డీసీపీ ప్రజలకు సూచించారు. మార్కెట్ ధర కంటే చాలా తక్కువ ధరకు వాహనాలు లభిస్తున్నప్పుడు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సరైన పత్రాలు లేకుండా లేదా అనుమానాస్పద పరిస్థితుల్లో వాహనాలు కొనుగోలు చేస్తే చట్టపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. కేసును ఛేదించి భారీ సంఖ్యలో వాహనాలను స్వాధీనం చేసుకున్న బేగంపేట క్రైమ్ టీమ్ను ఉన్నతాధికారులు అభినందించారని, త్వరలో తగిన విధంగా సత్కరించనున్నట్లు తెలిపారు.



# ఘనంగా తెలంగాణ ఉద్యమ జేఏసీ మాజీ కన్వీనర్ దొమ్మాటి కిరణ్ కుమార్ జన్మదిన వేడుకలు

**ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం చేతుల మీదుగా ఘన సన్మానం**

కుషాయిగూడ, అక్టోబర్ 13 (మనం న్యూస్): తెలంగాణ జేఏసీ మాజీ కన్వీనర్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మీడియా కన్వీనర్, సీనియర్ పాత్రికేయులు దొమ్మాటి కిరణ్ కుమార్ రావు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరాం ఆయనను ఘనంగా సన్మానించి, స్వీటు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ఉద్యమకారులు, పాత్రికేయ మిత్రులు కిరణ్ కుమార్ రావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో దొమ్మాటి కిరణ్ కుమార్ రావు కీలకంగా పాల్గొన్నారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం వివిధ జిల్లాల్లో నిర్వహించిన జేఏసీ నిరాహార దీక్షలు, రాస్తారోకోలు, వంటావార్పు వంటి ఆందోళన కార్యక్రమాల్లో ఆయన చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. వివిధ నిరసన కార్యక్రమాల ద్వారా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు కీర్తి శ్రీనివాస్, దాసారం శ్రీనివాస్, వెంకటాపురం రవి, ఇడుపాక సురేష్, నర్రా శ్రీనివాస్ రెడ్డి, టీపీసీసీ ఓబీసీ రాష్ట్ర కన్వీనర్ గరిక సుధాకర్, ఎరువ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# జోడిమెట్లలో నాళాల కబ్జా కలకలం!

**నాళాలను ఆక్రమించి కమర్షియల్ నిర్మాణాలా?**

**నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపణలు**

**ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా అధికారుల్లో చలనం లేదా?**

**జాడలేని ఇరిగేషన్ శాఖ.. పట్టించుకోని టౌన్ప్లానింగ్ అధికారులు!**

**నాళాలు కనుమరుగైతే వర్షపు నీరు వెళ్లేదెలా?**

**ఆక్రమణలపై చర్యలు తీసుకునేదెప్పుడు?..**

**కాలనీవాసుల నిలదీత**



ఘట్కేసర్ మనం న్యూస్ అక్టోబర్ 13: ప్రజల ఫిర్యాదులు బుట్టదాఖలవుతున్నాయా? నాళాలను ఆక్రమించి యథేచ్ఛగా వాణిజ్య నిర్మాణాలు చేపడుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదు? ప్రభుత్వ నిబంధనలు సామాన్యులకేనా? ఆక్రమణదారులకు వర్తించవా? అంటూ జోడిమెట్ల ప్రాంతవాసులు ప్రశ్నిస్తున్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని పోచారం 8వ డివిజన్ జోడిమెట్లలో నాళాల ఆక్రమణ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. మేధా కంపెనీ ఎదురుగా ఉన్న నాళాలను ఆక్రమించి నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇరిగేషన్, టౌన్ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నాళాలపైనే వాణిజ్య నిర్మాణాలా?

జోడిమెట్లలో భవిష్యత్తు అవసరాలను పట్టించుకోకుండా నాళాల సహజ ప్రవాహానికి ఆటంకం కలిగించేలా నిర్మాణాలు చేపడుతున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. నాళాల పరిధిని ఆక్రమించి కమర్షియల్ నిర్మాణాలు చేపడితే వర్షాకాలంలో వరదనీరు ఎటు వెళ్లాలని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో చిన్నపాటి వర్షాలకే రహదారులు జలమయమవుతున్న పరిస్థితుల్లో నాళాల ఆక్రమణలను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ ఏదీ?

నాళాల పరిరక్షణ విషయంలో సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు ఎందుకు స్పందించడం లేదని స్థానికులు నిలదీస్తున్నారు. నాళాల అసలు విస్తీర్ణం ఎంత? రెవెన్యూ రికార్డుల్లో వాటి హద్దులు ఎక్కడ ఉన్నాయి? ప్రస్తుతం చేపడుతున్న నిర్మాణాలు నాళాల పరిధిలోకి వస్తున్నాయా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

నాళాల హద్దులను గుర్తించకుండా నిర్మాణాలను ఎలా కొనసాగనిస్తున్నారు? ఫిర్యాదులు అందినా క్షేత్రస్థాయిలో తనిఖీలు ఎందుకు చేపట్టడం లేదు? అని ప్రశ్నిస్తున్నారు.

### టౌన్ప్లానింగ్ అధికారుల మౌనం ఎందుకు?

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వస్తున్నప్పటికీ టౌన్ప్లానింగ్ అధికారులు స్పందించడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాణిజ్య నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా? మంజూరైన ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు జరుగుతున్నాయా? నాళాలకు సంబంధించిన నిబంధనలు పాటించారా? అనే అంశాలను అధికారులు బహిర్గతం చేయాలని కోరుతున్నారు.

అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతుంటే చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు? అనుమతులు ఉంటే ఏ ప్రాతిపదికన మంజూరు చేశారు? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

### ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యమా?

నాళాల ఆక్రమణలపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందినప్పుడు వాటిపై విచారణ జరిపి, తీసుకున్న చర్యలను తెలియజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొంటున్నారు.

ఫిర్యాదులను పట్టించుకోకపోవడం వల్ల ఆక్రమణలకు అడ్డుకట్ట పడటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

### నాళాలు కనుమరుగైతే బాధ్యత ఎవరిది?

నాళాలు కేవలం మురుగునీరు వెళ్లే మార్గాలు మాత్రమే కాదని, వర్షపు నీటి ప్రవాహానికి అత్యంత కీలకమని స్థానికులు గుర్తుచేస్తున్నారు. వాటి సహజ ప్రవాహానికి ఆటంకం ఏర్పడితే సమీప కాలనీలు, రహదారులు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పుడే ఆక్రమణలను అడ్డుకోకపోతే భవిష్యత్తులో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు.

### ఉన్నతాధికారులు స్పందించాలి!

జోడిమెట్ల మేధా కంపెనీ ఎదురుగా జరుగుతున్న నిర్మాణాలపై రెవెన్యూ, ఇరిగేషన్, టౌన్ప్లానింగ్ శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

నాళాల హద్దులను అధికారిక రికార్డుల ఆధారంగా నిర్ధారించి, నిర్మాణ అనుమతులను పరిశీలించాలని కోరుతున్నారు. ఆక్రమణలు, నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రజల ఫిర్యాదులపై ఇప్పటివరకు ఏం చర్యలు తీసుకున్నారు? నిర్మాణాలకు అనుమతులు ఎవరిచ్చారు? నాళాల పరిరక్షణకు ఏం చర్యలు చేపడుతున్నారు? అనే ప్రశ్నలకు సంబంధిత శాఖల అధికారులు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి నాళాల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు...

---

## నాచారం ఈఎస్ఐ ఆసుపత్రిలో

# జీతాల కోసం కార్మికుల ఆందోళన

**నాలుగు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు..**

**సమస్య పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున సమ్మెకు దిగుతామని హెచ్చరిక..**

నాచారం, అక్టోబర్ 13 (మనం న్యూస్) నాచారం ఈఎస్ఐ ఆసుపత్రిలో యాక్టివిటీ కాంట్రాక్ట్ కింద పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంపై ఏఐటీయూసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఉదయం కార్మికులు రెండు గంటలపాటు విధులు నిలిపివేసి నిరసన ధర్నా నిర్వహించారు. ఇప్పటికే ఆసుపత్రి అధికారులకు రెండుసార్లు వినతిపత్రాలు అందజేసినా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆందోళనకు దిగినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంట్రాక్టు కార్మికులకు ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ, మరోవైపు నాలుగు నెలలుగా జీతాలు అందక కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. తెలంగాణలో ప్రధాన పండుగలైన బతుకమ్మ, దసరా సమయంలోనూ వేతనాలు అందక కార్మికుల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోగులకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ఇప్పటివరకు సమ్మెకు దిగలేదని, అయితే




సమస్య పరిష్కారం కాకపోతే తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మె చేపడతామని హెచ్చరించారు. సంబంధిత కాంట్రాక్టర్ను సంప్రదించగా, గత పది నెలలుగా ప్రభుత్వం నుంచి బిల్లులు రావడం లేదని, అయినప్పటికీ ఆరు నెలల వేతనాలు చెల్లించినట్లు తెలిపారని నాయకులు పేర్కొన్నారు. కార్మికులకు సంబంధించిన బిల్లులు సకాలంలో మంజూరు కాకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ఆసుపత్రి అధికారులు ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు.

# ఎంఎంసీ పరిధిలో అక్రమ నిర్మాణాలపై కొరడా

**మూడు జోన్ లలో ఆక్రమణల తొలగింపు డ్రైవ్.. రహదారులు, ఫుట్ పాత్ లను ఆక్రమిస్తే చర్యలు తప్పవు: కమిషనర్**







సికింద్రాబాద్, అక్టోబర్ 13 (మనం న్యూస్) మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధిలో అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్బీ నగర్ జోన్లలో ప్రత్యేక డ్రైవ్ లు చేపట్టి ప్రజా రహదారులు, ఫుట్ పాత్ లపై ఉన్న ఆక్రమణలను తొలగించారు.

**ఫుట్పాత్లపై ఆక్రమణల తొలగింపు..**

మల్కాజిగిరి జోన్లో ఫతేనగర్ నుంచి గౌతమ్ నగర్ వరకు ఆక్రమణలను తొలగించడంతోపాటు యోగేంద్ర పార్థి ప్రాంతంలో అక్రమంగా నిర్మించిన గదులను కూల్చివేశారు. ఉప్పల్ జోన్ లో ఘట్ కేసర్ పరిధిలోని ఎస్వీ నగర్ నుంచి రాంపల్లి ఎక్స్ రోడ్, నాగారం డివిజన్ వరకు ఆక్రమణలను తొలగించారు. కాచవాని సింగారంలో ఎనిమిది అక్రమ ర్యాంపులను తొలగించారు. ఉప్పల్, నాగోల్ మార్గంలో గుడిసెలను తొలగించడంతోపాటు శంకర్ నగర్లో రహదారిని ఆక్రమించిన ర్యాంపులపై చర్యలు తీసుకున్నారు.

**అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక నిఘా..**

ఎల్బీ నగర్ జోన్ లో నాగోల్ పరిధిలోని బండ్లగూడ, అప్కో కాలనీలో అనధికార నిర్మాణాలపై చర్యలు చేపట్టారు. సరూర్ నగర్ లో అష్టలక్ష్మి కమాన్ నుంచి డీవీఎం కాలేజ్, సిరిస్ రోడ్ వరకు నిర్వహించిన డ్రైవ్లో 15 ఆక్రమణలను తొలగించారు. కర్మన్ఘాట్ గ్రీన్ పార్క్ కాలనీలోనూ చర్యలు చేపట్టారు.

రహదారులు, ఫుట్పాత్ల ఆక్రమణలతో ట్రాఫిక్కు, పాదచారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. తొలగించిన ప్రాంతాల్లో తిరిగి ఆక్రమణలు జరగకుండా పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలు మున్సిపల్ నిబంధనలు పాటించి ప్రజా స్థలాల పరిరక్షణకు సహకరించాలని కోరారు.ల




# సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

**ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కె.వి.ఎల్.**

కుషాయిగూడ, అక్టోబర్ 13 (మనం న్యూస్): దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కె.వి.ఎల్. డిమాండ్ చేశారు. ఈసీఐఎల్ సెంటర్లోని మెగా జూనియర్ కళాశాలలో రామనారాయణ, శ్రీమన్నారాయణ అధ్యక్షతన అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నాలుగో మహాసభ జరిగింది.

సభను ప్రారంభించిన కె.వి.ఎల్. మాట్లాడుతూ.. ఓట్ల చోరీ ఆరోపణలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, శాంతియుత నిరసనకారులపై అణచివేతను ఆపాలని కోరారు. అంతర్జాతీయ యుద్ధ పరిణామాలతో ధరలు పెరిగి ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వచ్చే ఏడాది పాట్నాలో జరిగే జాతీయ మహాసభల నాటికి సభ్యత్వ లక్ష్యాలను పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.

ఐప్సో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. నాగేశ్వరరావు మాట్లాడుతూ శాంతి ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి రాజకీయ పార్టీలన్నీ ఐక్యంగా పనిచేయాలని అన్నారు. జిల్లా సమన్వయ ప్రధాన కార్యదర్శి ఉమామహేష్ జిల్లా కార్యక్రమాల నివేదికను వివరించారు.

నూతన కమిటీ ఎన్నిక: గౌరవ అధ్యక్షుడిగా ఈ. ఉమామహేష్, సమన్వయ ప్రధాన కార్యదర్శిగా డి.జి. నరేంద్ర ప్రసాద్, ప్రధాన కార్యదర్శులుగా పి. వెంకటేశ్వర్లు, కోమటి రవి, కార్యదర్శులుగా అన్వర్, రచ్చ కిషన్ ఎన్నికయ్యారు. అధ్యక్షవర్గ సభ్యులుగా రామ్ నారాయణ, ఎల్. కుమార్, వహీద్, రాజేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా కృపాసాగర్, అనురాధ, కె. నాగజ్యోతి, మహాలక్ష్మి తదితరులు ఎన్నికయ్యారు.

# బైక్ రైడర్ ఆకస్మిక బ్రేక్.. ఆర్టీసీ బస్సు ఢీ!

**నిర్లక్ష్యంగా ద్విచక్ర వాహనం నడిపినట్లు ఆరోపణ**
**సూచిక ఇవ్వకుండా ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో ప్రమాదం**
**బస్సు ముందు భాగంలోని హెడ్లైట్లు ధ్వంసం**
**ఘట్కేసర్ పోలీస్స్టేషన్లో కేసు నమోదు**




ఘట్కేసర్ మనం న్యూస్ అక్టోబర్ 13: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ పోలీస్స్టేషన్ పరిధిలో మంగళవారం ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం మధ్య రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బైక్ రైడర్ నిర్లక్ష్యంగా వాహనం నడుపుతూ ఎలాంటి సూచిక ఇవ్వకుండా ఆకస్మికంగా బ్రేక్ వేయడంతో ప్రమాదం జరిగినట్లు ఆర్టీసీ డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వివరాల్లోకి వెళితే.. యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపురం గ్రామానికి చెందిన చింతల రాములు (55) ఆర్టీసీ డ్రైవర్గా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో టీజీ 05 జెడ్ 1028 నంబరు గల ఆర్టీసీ బస్సును హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్ట వైపు నడుపుతూ ఘట్కేసర్-ఏదులాబాద్ రోడ్డు వద్దకు చేరుకున్నారు.

అదే సమయంలో ఏపీ 40 ఎన్ఏ 6925 నంబరు గల ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి రోడ్డుకు కుడివైపు నుంచి నిర్లక్ష్యంగా వాహనం నడుపుతూ ఎలాంటి సిగ్నల్ ఇవ్వకుండా ఒక్కసారిగా బ్రేక్ వేసినట్లు డ్రైవర్ పేర్కొన్నారు. దీంతో ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనగా బస్సు ముందు భాగంలోని హెడ్లైట్లు దెబ్బతిన్నాయి.

ద్విచక్ర వాహనదారుడిని షేక్ నసీర్గా గుర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనపై ఆర్టీసీ డ్రైవర్ రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘట్కేసర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు...

# రెడ్డి కాలనీలో రోడ్డు పనులు ప్రారంభం

**డ్రైనేజీ, రోడ్ల అభివృద్ధికి రూ.50 లక్షల నిధులు.**

కుషాయిగూడ, అక్టోబర్ 13 (మనం న్యూస్): వంపుగూడ డివిజన్ పరిధిలోని రెడ్డి కాలనీలో రోడ్డు పనులను పడమటి మల్లారెడ్డి, మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణితో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తూ సహకరిస్తున్నారని తెలిపారు. ఇందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రెడ్డి కాలనీ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. కాలనీలో డ్రైనేజీ, రోడ్ల పనుల కోసం రూ.50 లక్షల నిధులు మంజూరు చేయించడంలో సహకరించిన పరమేశ్వర్ రెడ్డి, స్వర్ణరాజ్ శివమణి, పడమటి మల్లారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు టిల్లు యాదవ్, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి శ్రీనివాస్, రాజు, షాబుద్దీన్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# కిడ్నీ చికిత్స మధ్యలో మెదడుకు ముప్పు!..

**మెదడులో రక్తస్రావంతో విషమించిన 28 ఏళ్ల మహిళ పరిస్థితి..**
**అత్యల్ప స్థాయిలో ప్లేట్ లెట్లు.. వైద్యుల నిరంతర పర్యవేక్షణ..**





సికింద్రాబాద్, అక్టోబర్ 13 (మనం న్యూస్) కిడ్నీలో రాయితో ఆసుపత్రిలో చేరిన 28 ఏళ్ల మహిళకు చికిత్స అనంతరం మెదడులో రక్తస్రావం జరగడంతో ఆమె పరిస్థితి విషమంగా మారింది. మెడికవర్ హాస్పిటల్స్ లో చికిత్స పొందుతున్న టి. ఐశ్వర్య ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం ఆందోళనకరంగా ఉందని వైద్యులు వెల్లడించారు. తీవ్రమైన కడుపునొప్పితో అక్టోబర్ 7న ఆసుపత్రిలో చేరిన ఐశ్వర్యకు వైద్య పరీక్షలు నిర్వహించగా, కిడ్నీ నుంచి మూత్రనాళానికి వెళ్లే మార్గంలో (పీయూజే) పెద్ద రాయి అడ్డుపడటంతో మూత్ర ప్రవాహం నిలిచిపోయి కిడ్నీ వాపునకు గురైనట్లు గుర్తించారు. శస్త్రచికిత్స ద్వారా రాయిని తొలగించే క్రమంలో కిడ్నీలో పెద్ద మొత్తంలో చీము ఉన్నట్లు గుర్తించారు. రాయిని విజయవంతంగా తొలగించిన అనంతరం ఆమెను వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. అయితే, ఆ తర్వాత రక్తంలో తెల్ల రక్తకణాలు, ప్లేట్లెట్ల సంఖ్య గణనీయంగా తగ్గడంతో పాటు రక్తపోటులో మార్పులు, శరీరంలో తీవ్రమైన వాపు ప్రతిస్పందన ఏర్పడింది. దీంతో యాంటీబయాటిక్స్‌తో పాటు అవసరమైన చికిత్స అందిస్తూ మెరుగైన పర్యవేక్షణ కోసం మెడికల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎంఐసీయూ) కు తరలించారు. మూడు రోజుల చికిత్స అనంతరం రక్త ప్రసరణ, ఆక్సిజన్ స్థాయిల్లో మెరుగుదల కనిపించినప్పటికీ ప్లేట్ లెట్ల సంఖ్య మాత్రం తక్కువగానే కొనసాగింది. ప్లేట్ లెట్లు ఎక్కించినా ఆశించిన స్థాయిలో పెరుగుదల కనిపించలేదు. ఈ నేపథ్యంలో నిర్వహించిన సీటీ స్కాన్లో మెదడులో రక్తస్రావం జరిగినట్లు వెల్లడైంది. వెంటనే న్యూరాలజీ, న్యూరోసర్జరీ నిపుణుల సలహాలు తీసుకున్నారు. అయితే ప్లేట్ లెట్ల సంఖ్య అత్యల్పంగా ఉండటం, శరీరంలో వాపు సూచికలు అధికంగా ఉండటంతో తక్షణ శస్త్రచికిత్స చేయడం ప్రమాదకరమని వైద్యులు భావించారు. ప్రస్తుతం మందులతో చికిత్స కొనసాగిస్తున్నారు. రోగి మెదడులో ఒత్తిడి పెరిగినట్లు, కంటి పాపలు విస్తరించి కాంతికి స్పందించడం లేదని వైద్యులు తెలిపారు. అయినప్పటికీ ఆమె స్వయంగా శ్వాస తీసుకుంటుండటంతో పాటు దగ్గు ప్రతిచర్య కొనసాగుతోందని వెల్లడించారు. ఐశ్వర్య పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని, వైద్య బృందం నిరంతరం పర్యవేక్షిస్తూ చికిత్స అందిస్తోందని పేర్కొన్నారు. రోగి ఆరోగ్య పరిస్థితి, చికిత్స పురోగతిపై కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నట్లు మెడికవర్ హాస్పిటల్స్ హెల్త్ బులెటిన్ లో వెల్లడించింది.

---




## చిన్నారి స్పర్శకు రూ.3 లక్షల ఆర్థిక సాయం

**కేటీఆర్తో ఫోన్లో మాట్లాడించిన మాజీ జడ్పీటీసీ పట్లం అవినాష్ రెడ్డి**
**షాబాద్ మోడల్ స్కూల్లో ఇంటర్మీడియట్ చదువుతున్న స్పర్శ అక్కకు ల్యాప్టాప్ అందిస్తానని అవినాష్ రెడ్డి హామీ**

షాబాద్,అక్టోబర్ 13 (మనం న్యూస్ ) నాకు మా నాన్న కావాలి అంటూ పరీక్షలో చిన్నారి రాసిన సమాధానం పలువురిని కంటతడి పెట్టించింది. మాచన్పల్లి గ్రామానికి చెందిన బైండ్ల స్పర్శ తండ్రి మూడేళ్ల క్రితం మృతి చెందాడు. ప్రస్తుతం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న స్పర్శకు ఇటీవల నిర్వహించిన ఫిఏ1 పరీక్షలో 'దేవుడు ప్రత్యక్షమై ఏం కావాలో కోరుకోమంటే ఏం అడుగుతావు?' అనే ప్రశ్న ఎదురైంది. అందుకు ఆ చిన్నారి 'నాకు మా నాన్న కావాలి' అని రాసిన సమాధానం సోషల్ మీడియాలో వైరల్గా మారింది.

ఈ విషయం కేటీఆర్ దృష్టికి వెళ్లడంతో ఆయన స్పందించి చిన్నారి వివరాలు తెలుసుకోవాలని మాజీ జడ్పీటీసీ పట్లం అవినాష్ రెడ్డికి సూచించారు. దీంతో మూడు రోజుల క్రితం చిన్నారిని తన నివాసానికి పిలిపించుకున్న అవినాష్ రెడ్డి, ఆమె కుటుంబ పరిస్థితులను తెలుసుకున్నారు. కేటీఆర్ సూచనతో పాటు ఆయన స్ఫూర్తితో మంగళవారం స్పర్శకు రూ.3 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారిని కేటీఆర్తో ఫోన్లో మాట్లాడించారు.



చిన్నారి రాసిన సమాధానం తనను తీవ్రంగా కలచివేసిందని కేటీఆర్ పేర్కొన్నట్లు సమాచారం. స్పర్శకు ఆర్థిక సాయం అందించిన అవినాష్ రెడ్డిని ఆయన అభినందించారు. వారం రోజుల తర్వాత చిన్నారిని తన వద్దకు తీసుకురావాలని సూచించారు. అంతేకాకుండా మోడల్ స్కూల్లో ఇంటర్మీడియట్ చదువుతున్న స్పర్శ అక్కకు ల్యాప్టాప్ అందిస్తానని అవినాష్ రెడ్డి హామీ ఇచ్చారు. తండ్రిని కోల్పోయిన చిన్నారికి ఆర్థిక సాయం అందడం పట్ల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. దేవుడి రూపంలో తమకు అండ లభించిందని పేర్కొన్నారు.



ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్న నరసింహారెడ్డి, గ్రామ సర్పంచ్ రాధ, మాజీ సర్పంచ్ మహేందర్ రెడ్డి, నాయకులు గోపాల్ నాయక్, జైపాల్, రాములు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్లలో రోడ్డు ప్రమాదం.. వంట మాస్టర్ మృతి

**ఇబ్రహీంపల్లి గేటు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ**
**బస్తేపూర్ గ్రామంలో విషాదం**

చేవెళ్ల, అక్టోబర్ 13(మనం న్యూస్): రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్తేపూర్ గ్రామానికి చెందిన బేగరి రాఘవేందర్ (37) మృతి చెందాడు.ఈ ఘటన అక్టోబర్ 12న రాత్రి 9 గంటల సమయంలో ఇబ్రహీంపల్లి గేట్ సమీపంలోని చాయ్ బంక్ వద్ద చోటుచేసుకుంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బస్తేపూర్ గ్రామానికి చెందిన రాఘవేందర్ హైదరాబాద్లోని హఫీజ్పేట్లో వంట పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజువారీ పనిలో భాగంగా సోమవారం ఉదయం హఫీజ్పేట్కు వెళ్లి, రాత్రి 8.30 గంటల సమయంలో తన గ్లామర్ బైక్ పై ఇంటికి తిరిగి వస్తున్నాడు. అనంతరం పాలు తీసుకురావడానికి చేవెళ్ల వైపు వెళ్తుండగా ఇబ్రహీంపల్లి గేట్ సమీపంలో గుర్తుతెలియని వాహనం వేగంగా, అజాగ్రత్తగా వచ్చి అతని బైక్ను ఢీకొట్టింది.

ఈ ప్రమాదంలో రాఘవేందర్ తలకు, కుడి కాలికి, కుడి చేతికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన వాహనం డ్రైవర్ ఆపకుండా అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడి భార్య బేగరి మహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చేవెళ్ల పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనాన్ని, దాని డ్రైవర్ను గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టారు. - చేవెళ్ల పోలీస్ స్టేషన్, రంగారెడ్డి జిల్లా

## కట్ట మైసమ్మ ఆలయంలో పద్మారావు గౌడ్ ప్రత్యేక పూజలు..

**నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి..**
**అన్నప్రసాద వితరణ ప్రారంభించిన ఎమ్మెల్యే..**



సికింద్రాబాద్, అక్టోబర్ 13 (మనం న్యూస్) దేవీ నవరాత్రి ఉత్సవాలను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ ఆకాంక్షించారు. మంగళవారం చిలకలగూడలోని చారిత్రాత్మక కట్ట మైసమ్మ దేవాలయాన్ని సందర్శించిన ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులకు నవరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు తీగుల్ల కిషోర్ కుమార్, మాజీ కార్పొరేటర్ సామల హేమ తదితరులు పాల్గొన్నారు.

# గుండ్ల చెరువు ఎఫ్‌టిఎల్‌లో వెంచర్

**గుండ్ల చెరువు సంబంధించిన స్థలం కబ్జా**

**డ్రైనేజ్ తో పాటు రోడ్డు కబ్జా?**

**సమగ్ర విచారణ జరిపించాలని స్థానికుల డిమాండ్**

మేడ్చల్, అక్టోబర్13: ( మనం జిల్లా ప్రతినిధి): మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలో గుండ్ల చెరువు కబ్జాకు గురైంది.

ఈ చెరువు సమీపంలో స్థలాన్ని పలువురు కబ్జా చేశారు. అంతేకాకుండా అక్కడ ఉన్న రోడ్డుతో పాటు డ్రైనేజీని సైతం కబ్జా చేశారు. గుండ్ల చెరువు పక్కనే ఉన్న 252 సర్వే నెంబర్లు ప్రభుత్వ స్థలాన్ని అకౌంట్స్ జనరల్ ఆఫీస్ ఎంప్లాయిస్ కు కేటాయించారు. ఈ స్థలం పూర్తిగా ఎఫ్టీఎల్ లో ఉన్నట్లు తెలుస్తుంది. చెరువులను కబ్జాకు పాల్పడితే చూస్తూ ఊరుకోమని అటు ప్రభుత్వం కానీ ఇటు అధికారు హెచ్చరిస్తున్నప్పటికీ చెరువులు మాత్రం యదోచ్ఛగా కబ్జాకు గురవుతున్న అధికారులు పట్టించుకోకపోవడం పై విమర్శలు వెలుగుతున్నాయి.

**చెరువులోనే వెంచర్**

చెరువులోనే వెంచర్ వేసుకుని ప్లాట్లు అమ్ముకుంటున్న అటు రెవెన్యూ అధికారులు కానీ ఇటు ఇరిగేషన్ అధికారులు కానీ నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. 252 సర్వే నెంబర్లు గండి చెరువు స్పష్టంగా కనిపిస్తుందని. ఇక్కడ 2010లో అకౌంట్స్ జనరల్ హౌసింగ్ సొసైటీ వరకి కేటాయించారు. ఈ స్థలం బాజప్ప గండి మైసమ్మ చెరువులోనే ఉంది. అంతేకాకుండా రోడ్ల కోసం వదిలేసిన స్థలంలో సైతం మట్టితో నింపేసి. గుండ్ల పోచంపల్లి నుండి గండి మైసమ్మ చెరువుకు నుండి వచ్చే డ్రైనేజీ న పై మట్టి కప్పి కబ్జా చేసినట్లు. ఈ వెంచర్ గడి మైసమ్మ చెరువులో ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ దీనిపై చర్యలు తీసుకునేందుకు అధికారులు వెనుకాడుతున్నట్లు సమాచారం వినిపిస్తుంది.





ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపితే అసలు వాస్తవాలు బయటకు వస్తాయని స్థానికులు పేర్కొంటున్నారు.

**సమగ్ర విచారణ జరపాలి**

గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలోని 252 సర్వే నెంబర్లు జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపించాలని స్థానిక ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు. సముద్రంలోనే వెంచర్ ఉందన్న విషయం హైడ్రా అధికారులకు తెలువకపోవడం విచారకరం.

**కమీషనర్ సమగ్ర విచారణ జరిపించాలి**

ఈ విషయంలో ఎల్లంపేట కమిషనర్ కృష్ణారెడ్డి సమగ్ర విచారణ జరిపించాలని స్థానికులు కోరుతున్నారు. కబ్జాకు గురైన ఈ చెరువుపై ఉన్నత అధికారులతో సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

---



## దేవి శరన్నవరాత్రి పూజలో పాల్గొన్న పిఎసి చైర్మన్ అరకపూడి గాంధీ

మనం న్యూస్ // మియాపూర్, అక్టోబర్ 13 : శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని తారా నగర్ లో దసరా పర్వదినం పురస్కరించుకుని దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా జరిగిన పూజ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ,సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి ల తో కలసి ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం తీసుకొని ప్రత్యేక పూజలు చేసిన పి ఏ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.

ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వీరేశం గౌడ్, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, రాంచందర్, గోపి , కవిత, నరేందర్ బల్ల, ప్రవీణ్, అజయ్ మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## దసరా సెలవులను తప్పనిసరిగా అమలు చేయాలి

**సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే ఆందోళనలు చేపడతాం: ఎన్ఎస్ యూ ఐ చేవెళ్ల మండల అధ్యక్షుడు ఎండి సమిరుద్దీన్**




చేవెళ్ల, అక్టోబర్ 13 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ప్రకటించిన దసరా సెలవులను అన్ని విద్యాసంస్థలు తప్పనిసరిగా అమలు చేయాలని ఎన్ఎస్యూఐ చేవెళ్ల మండల అధ్యక్షుడు ఎండీ సమీరుద్దీన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ, దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించేందుకు ప్రయత్నించే విద్యాసంస్థల తీరును ఖండించారు.

విద్యార్థులు చదువుతో పాటు కుటుంబ సభ్యులతో కలిసి పండుగను ఆనందంగా జరుపుకునే అవకాశం కల్పించాలని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే ఎన్ఎస్యూఐ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

విద్యార్థుల హక్కులను పరిరక్షించేందుకు ఎన్ఎస్యూఐ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఎండీ సమీరుద్దీన్ స్పష్టం చేశారు.

---

## ఏపీఎల్లో రాజ్పుతానా రాయల్స్‌కు వరుసగా రెండో విజయం

హైదరాబాద్, అక్టోబర్ 13 (మనం న్యూస్) : ఆర్చరీ ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-2లో డిఫెండింగ్ ఛాంపియన్ రాజ్పుతానా రాయల్స్ 6-0తో చెరో ఆర్చర్స్ను చిత్తు చేసింది. వరుసగా మూడు ఓటముల తర్వాత పుంజుకున్న రాయల్స్కు ఎల్లా గిబ్సన్(60/60), మెటె గజోజ్, సంగీత కీలకంగా నిలిచారు. చెరో తరఫున కేసీ కౌఫ్హోల్డ్, అతాను దాస్, కుమ్కుమ్ మోహోడ్ ఆడారు. ఈ విజయంతో రాజ్పుతానా రాయల్స్ ఆరు పాయింట్లకు చేరుకుంది. బుధవారం చెరో ఆర్చర్స్-పృథ్వీరాజ్ యోధాస్, కాకతీయ నైట్స్-రాజ్పుతానా రాయల్స్, చోళ చీఫ్స్-మైటీ మరాఠాస్ మధ్య మ్యాచ్లు జరగనున్నాయి.

